క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులతో వెళ్తున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న పాస్టర్ ప్రభుదాస్

సూర్యాపేట : ఖమ్మం నగరంలోని వరద బాధితులకు సూర్యాపేట పట్టణంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి స్త్రీల సమాజం అధ్యక్షురాలు పెదపంగు కవిత ఆధ్వర్యంలో భగత్‌సింగ్ నగర్ సెంటర్ లీడర్ కత్తుల సృజనప్రేమ్‌కుమార్ సహకారంతో 30కుటుంబాలకు వారం రోజులకు సరిపడా నిత్యావసర వంట సరుకులను ప్రత్యేక వాహనంలో పంపించారు. సరుకులను తరలిస్తున్న వాహనాన్ని బుధవారం పాస్టర్ ప్రభుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు జాన్‌సుమిత్ర, కమిటీ సభ్యులు స్టెల్లా ప్రభుకిరణ్, దుబ్బా రాములమ్మ, అరుణ, తులసి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల భవనాన్ని నిర్మించాలని వినతి



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం బాధ్యులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని కాసర్లపహాడ్‌లో సాంఘిక సంక్షేమ శాఖకు కేటాయించిన 8ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, జాజిరెడ్డిగూడెం ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయానికి భవనాలను నిర్మించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం సభ్యులు కోరారు. ఈ విషయంపై బుధవారం హైదరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, వెంకటేష్, ఈదుల రామాంజనేయులు, రమేష్, బాబు, శంకర్, ప్రవీణ్, యల్లయ్య పాల్గొన్నారు.

వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బెజవాడ వెంకటేశ్వర్లు

తిరుమలగిరి : తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 76వ సంవత్సరం సందర్భంగా అన్ని గ్రామాల్లో అమర వీరుల స్థూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తామని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి, మండల కార్యదర్శి ఎండీ.ఫయాజ్, జంపాల మల్లయ్య, ఎర్ర మొగిలి, శ్రీకాంత్, స్వరూప, అంజయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

తుంగతుర్తి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలపై బుధవారం పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దన్నారు. అనంతరం పోలీసు కళా బృందం సభ్యులు తమ ఆట, పాటలతో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ఏఎస్ఐ భగవాన్, పోలీస్ సిబ్బంది, హెచ్ఎం సహదేవ్, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, గురులింగం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ పవన్‌కుమార్

అర్వపల్లి : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం అర్వపల్లిలోని పలు వీధుల్లో తిరిగి ఆయన సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి జ్యోతిరెడ్డి, ఏపీఓ ఉపేందర్, ఈసీ నగేష్, టీఏ దీపిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామాల్లో తయారు కాని సేంద్రియ ఎరువు
- వీధుల్లో, రోడ్ల వెంట పేరుకుపోతున్న చెత్తాచెదారం

తుంగతుర్తి : గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు, గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్త నుంచి షెడ్లలో కంపోస్టు ఎరువులు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని భావించింది. కానీ నాటి నుంచి నేటి వరకు కంపోస్టు ఎరువులు తయారీ చేయకుండా అవి నిరుపయోగంగా మారాయి. నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు హడావుడి చేసిన అధికారులు పూర్తి అయిన తర్వాత వాటి సంగతి మర్చిపోయారు. సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువు తయారు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదు. ఫలితంగా లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు అలంకారప్రాయంగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు సైతం అటువైపు దృష్టి సారించకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు. మండలంలో 24గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఒకటి, రెండు గ్రామాలు మినహా అన్ని గ్రామాల్లో సెరిగేషన్ షెడ్లను వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇళ్ల నుంచి సేకరించిన పొడి చెత్తలోని కాగితాలు అట్టముక్కలు, గాజుసీసాలు, ఇనుప వ్యర్థాలు వేరు చేసి, తడి చెత్తను ప్రత్యేక పద్ధతిలో నిల్వచేసి కంపోస్టు ఎరువుగా మార్చాలి. ఎరువును విక్రయించడం ద్వారా వచ్చే నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. షెడ్ల నిర్మాణ పనులు పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా వాటిని నేటి వరకు వినియోగించకపోవడంతో గ్రామాల్లో రోడ్డు పక్కన, జనావాసాల మధ్య చెత్త దర్శనమిస్తూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. మండలంలో షెడ్ల నిర్మాణం కోసం ఒక్కోషెడ్డుకు రూ.2.50లక్షల చొప్పున ఖర్చు చేసి నిర్మించారు. వాటిని వినియోగించకపోవడంతో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఆదాయం రాకపోవడం గమనార్హం.



కర్విరాలలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు



కొత్తగూడెంలో నిరుపయోగంగా..

అధికారుల నిర్లక్ష్య ధోరణి..

నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు సెరిగేషన్ షెడ్ల ద్వారా అదనంగా ఆర్థిక వనరులు వచ్చే అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. షెడ్ల నిర్వహణ భారమంటూ పంచాయతీలు ముందుకు రావడం లేదు. ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్త ఇతర వస్తువును సేకరించి రహదారుల పక్కన పాతబావుల్లో పడేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో రోడ్డు పక్కన, జనావాసాల మధ్య పోసి కాల్చేస్తున్నారు.

వీధుల్లోనే పేరుకుపోతున్న చెత్తాచెదారం..

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో రోడ్ల పక్కన, వీధులోనే చెత్తచెదారం దర్శనమిస్తోంది. పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తతో కంపోస్టు ఎరువు తయారీ చేసి పంచాయతీలకు ఆదాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి డంపింగ్ యార్డును అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గల సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువు తయారీ చేసేలా తగిన చర్యలు తీసుకుంటాం. మండలంలోని అన్ని సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తెచ్చేలా చూస్తాం.

– శేషుకుమార్, ఎంపీడీఓ, తుంగతుర్తి

నియోజకవర్గంలో అధిక సభ్యత్వాలు చేయించాలి



పెన్‌పహాడ్ : సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

సూర్యాపేట : నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాలను అత్యధికంగా చేయించాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని 34వ వార్డులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ రంగినేని లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ సభ్యత్వాల కార్యక్రమం మొదలైందని, బూత్ స్థాయిలో 200 సభ్యత్వాలు చేయాలన్నారు.100సభ్యత్వాలు చేసిన వారికే క్రియాశీల సభ్యత్వం వస్తుందని, క్రియాశీలక సభ్యత్వం వచ్చిన వారికే మండల, జిల్లా స్థాయిలో పదవులు వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రతి పోలింగ్ బూత్‌లో సభ్యత్వాలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబిద్, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, గజ్జల వెంకటరెడ్డి, మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు షేక్ సలీంపాషా పాల్గొన్నారు.

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

పెన్‌పహాడ్ : ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబీద్, జిల్లా ఉపాధ్యక్షుడు చలమల నరసింహ, పోకల వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు పోకల రాములు, జిల్లా నాయకులు తూముల సాయి, మండల ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి మధు, చెన్ను రమణారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కేసరి శోభారెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్లు నిర్మించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలోని అంజనాపురి కాలనీ రోడ్ నంబర్ 2, 3, 4లలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే సీసీరోడ్లు నిర్మించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మహిళలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రద్దు చేసిన టెండర్లను వెంటనే పునరుద్ధరించి సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. అలాగే ఖాళీ ప్రదేశాలు ఉండడంతో చెట్లు పెరిగి కుక్కల బెడద విపరీతంగా ఉందని, రాత్రిపూట బయటికి రావాలంటేనే భయంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మహిళలు చెరుకు ఏకలక్ష్మి, ప్రేమకుమారి, జ్యోతి, అర్చన, సంతోషి, అమల ఉన్నారు.

రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన



నిరసన తెలుపుతున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఢిల్లీలో జరుగుతున్న నిరసనకు సంఘీభావంగా బుధవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ల వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్లు తల్లమల్ల హసేన్, మేక వెంకన్న, యరమ్రల్ల రాములు మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును వ్యతిరేకిస్తూ నెల రోజులుగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజల మనోభావాలను, అర్థం చేసుకొని రిజర్వేషన్‌ను వర్గీకరణ చేయరాదని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పున సమీక్షించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో నాయకులు వీర్జాల వేణు బలరాం, అనుములపూరి జానకిరాములు, పిట్టల భాగ్యమ్మ, బొల్లెద్దు వినయ్, బోయిల అఖిల్, సైదులు, మురళి పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్‌కు అప్పగించొద్దు



భానుపురి (సూర్యాపేట) : సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

భానుపురి (సూర్యాపేట) : భవన నిర్మాణ రంగ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు అప్పగించొద్దని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ అన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు బాధాకరమన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా కాకుండా ప్రభుత్వ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట, 23న లేబర్ కమిషనర్ కార్యాలయం హైదరాబాద్‌లో జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా ధర్నా కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు సోమపంగు రాధాకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అనంతుల మల్లయ్య, సోమయ్యగౌడ్, తిరుమలేష్, రేణుక, సుజాత, శ్రీనివాస్, సైదులు, బాలశౌ రెడ్డి, లింగయ్య, రాములు, దస్తగిరి, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

భవన నిర్మాణ కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం కార్మిక వర్గానికి వ్యతిరేకమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డ్ స్కీంలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దంటూ పట్టణంలోని వాణిజ్య భవన్ చౌరస్తా వద్ద బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, వీరబోయిన లింగయ్య, నారాయణ, జ్యోతుల సైదులు, మల్లయ్య, మురళి, బొర్ర వెంకన్న, అక్బర్, రహీం పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద పూజలు, అన్నదానాలు



సూర్యాపేట : అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ దంపతులు

సూర్యాపేట : గణేష్ నవరాత్రుల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శ్రీవాసవి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్జి నాగేందర్, మిట్టపల్లి రమేష్, నగిరి సుదర్శన్, రమేష్, యాదగిరి, సందీప్, లక్ష్మీనారాయణ, శిరీష, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : గణేష్ నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం అర్వపల్లిలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో బైరబోయిన మహరాజు, దేవస్థాన మాజీ చైర్మన్ విద్యాసాగర్, మాజీ ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, శ్రీనివాస్, రాజలింగం ఉన్నారు.

నాగారం : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో గీతాంజలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద భక్తురాలు కన్నెబోయిన బాలమణి బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గీతాంజలి యూత్ అసోసియేషన్ సభ్యులు కన్నెబోయిన భద్రయ్య, కత్తుల వెంకన్న, లింగమల్లు, ఉమేష్, స్వామి పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలను జరుపుకోవాలి

అర్వపల్లి : గణేష్ నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాలను నిర్వాహకులు, ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఏఎస్ఐ భూక్యా రాంకోటి కోరారు. బుధవారం స్థానికంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శాంతి భద్రతలకు సంబంధించి ఏ సమస్య ఏర్పడినా నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో సిబ్బంది రాజ, రమణ, శ్రీను, సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో బుధవారం 5వ రోజు గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు గ్రామాలలో వినాయకుడి విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేములపల్లి వాసుదేవరావు, మాజీ సర్పంచ్ జటంగి వెంకటేశ్వర్లుయాదవ్, యల్కపల్లి భిక్షం, వెంకన్న, అభి పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

పెన్‌పహాడ్ : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, శనగాని రాంబాబు, సాకేత్, మణి ఉన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అర్వపల్లి : తిమ్మాపురంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తుందని, మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరును పెట్టడం అభ్యుదయవాదానికి నిదర్శనమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు, పేద ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. చేనేత యూనివర్సిటీకి ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిందన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వకు మాజీ పార్లమెంట్ సభ్యుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. త్వరలోనే తిరుమలగిరిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, మినీస్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఈనెల చివరిలోపు నియోజకవర్గంలోని 4 వ్యవసాయ మార్కెట్ల పాలక కమిటీలను భర్తీ చేస్తామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా అధికారులను ఆదేశించారు. అక్రమ వెంచర్లపై, చెరువులు, కుంటలలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, పాలకుర్తి రాజయ్య, జమ్మిలాల్, పేరాల వీరేష్, జనార్దన్, సుధాకర్ ఉన్నారు.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండలంలోని గుండెపురి ప్రభుత్వ పాఠశాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. పాఠశాల ప్రహారీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈదుల సోమమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామానికి చెందిన అంబటి లక్ష్మమ్మ, కంచర్ల సుమతీలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.5,000 చొప్పున రూ.15,000 ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పసుపులేటి వెంకట్‌రెడ్డి, సుంకరి జనార్దన్, శీల కృష్ణమూర్తి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వడ్డే యాదగిరి, పిన్నమరెడ్డి సోమిరెడ్డి, నాతి శ్రీనివాస్, వేణు, మాద ముత్తయ్య, ఉప్పలయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

దుబ్బాక సంజీవరెడ్డి త్యాగం మరువలేనిది



నాగారం : సంజీవరెడ్డి స్మారక స్థూపం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న డేవిడ్‌కుమార్

నాగారం : ప్రతిఘటన పోరాట యోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక సంజీవరెడ్డి త్యాగం మరువలేదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పసునూర్ గ్రామస్టేజీ వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సంజీవరెడ్డి 26వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారకస్థూపం వద్ద జెండాను ఆవిష్కరించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దుబ్బాక కరుణాకర్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, అరుణోదయ రాష్ట్ర కమిటీ సభ్యులు తడకమళ్ల సంజవ, రాజ్‌కుమార్, ఖాసీం పాల్గొన్నారు.

సంజీవరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి

తుంగతుర్తి : దుబ్బాక సంజీవరెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంజీవరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వేర్పుల లక్ష్మయ్య, గొడ్డలి నర్సయ్య, వేర్పుల పరుశరాములు, మామిడి సుధాకర్, ఎస్‌కే యాకూబ్, హుస్సేన్, భాస్కర్, గుమ్మడోజు నారాయణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఆదర్శ విప్లవకారుడు దుబ్బాక సంజీవరెడ్డి

సూర్యాపేట టౌన్ : ఆదర్శ విప్లవకారుడు దుబ్బాక సంజీవరెడ్డి అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని విక్రమ్‌భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో సంజీవరెడ్డి 26వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, రేణుక, సయ్యద్, సంతోషి, పద్మ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

అబ్బయ్య మృతి పార్టీకి తీరనిలోటు

ఆత్మకూర్ (ఎస్) : సీపీఎం నాయకులు గుండు అబ్బయ్య మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని గట్టికల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు నాయకుడు గుండు అబ్బయ్య(85) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా వారు అబ్బయ్య మృతదేహంపై ఎర్ర జెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు గుండు లింగయ్య అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు దండ వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, బత్తుల సుధాకర్, సైదులు, కనకమ్మ ఉన్నారు.

న్యాయ విచారణ జరిపించాలి

ఆత్మకూర్ (ఎస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలని సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకపక్షంగా కాల్పులు జరిపి పోలీసులు కట్టుకథలు అల్లుతున్నారని వాపోయారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని హెచ్ఎం ఉప్పు నాగయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అల్లునూరు ప్రాథమిక పాఠశాలలో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనం భద్రమ్మ కుమారుడు వనం లింగయ్య విద్యార్థులకు టై, బెల్టు, ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బంటు క్రాంతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కోల శోభ, నాగేశ్వర్‌రావు, సురేందర్, సరిత, మమత, కవిత, శ్రావణి, సమ్మక్క, మంగమ్మ పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు అందజేత

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయుల సహకారంతో రూ.5వేల విలువ గల తెలుగు, ఇంగ్లిష్ చూచిరాత నోట్‌పుస్తకాలను 52మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.నరేందర్, ఉపాధ్యాయులు నల్ల శ్రీనివాసులు, పి.సరిత, ప్రమీల, కార్యదర్శి అఖిల్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆలయ కమిటీ చైర్మన్ బెలిదె శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆలయంలో స్వామి వారికి వెండి మకర తోరణం, పీఠానికి వెండి తొడుగు చేయించాలని కమిటీ వారు నిర్ణయించడంతో దాతలు ముందుకొచ్చి విరాళాలు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని ర్యాలీ

తిరుమలగిరి : పట్టణంలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని బుధవారం బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో స్థానికంగా 200బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బస్ డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య, ఎవరెస్ట్ యూత్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ కట్కూరి ఉపేందర్, పాషా, లింగయ్య, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

బొప్పారం క్వారీకి ముళ్లకంచె ఏర్పాటు

ఆత్మకూర్ (ఎస్) : మండలంలోని బొప్పారం గ్రామంలో ప్రమాదకరంగా మారి నలుగురి ప్రాణాలను బలిగొన్న నాపరాయి క్వారీ చుట్టూ పోలీసులు ముళ్ల కంచెను వేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామంలో పది సంవత్సరాలకు పైగా నాపరాయి క్వారీని నిర్వహిస్తున్నారు. రెండు సంవత్సరాల నుంచి క్వారీ పనులు నిలిచిపోగా గతంలో ఏర్పడిన పెద్దపెద్ద గుంతలు బావులను తలపిస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలో నలుగురు అందులో దిగి మృత్యువాత పడడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురై శాశ్వతంగా మూసివేయాలని అధికారులకు విన్నవించడంతో బుధవారం పోలీసులు క్వారీ చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేసి క్వారీ గుంత ప్రమాదకరమైనదని, ఇందులోకి ఎవరు దిగరాదని, ఈత కొట్టరాదని హెచ్చరిస్తూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సైదులుగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

సూర్యాపేట : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు కేశవ్ కుటుంబానికి సూర్యాపేట జర్నలిస్టులు అండగా నిలిచారు. సహచర జర్నలిస్టు మృతితో ఆయన కుటుంబానికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మిత్రుల పిలుపు మేరకు 62మంది కలిసి రూ.50,066లను సమీకరించి బుధవారం కేశవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

తుంగతుర్తి : వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు, మృతి చెందిన పశువులకు రూ.75వేలు, గొర్రెలకు, మేకలకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి నూతనంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. సమావేశంలో గంట నాగయ్య,శంకర్, సైదులు, కిరణ్, సంజీవ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

చివ్వెంల : కుక్కల దాడిలో ఐదుగురు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బి.చందుపట్ల గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన సిద్దోజ్ జస్విత్, కాసాని సోన్విత్, సిద్దోజ్ వివేక్ తమ ఇంటి ముందు వీధిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వీరితో పాటు గ్రామ శివారులోని ఎస్సీ హాస్టల్ వద్ద ఇద్దరు విద్యార్థులను గాయపర్చాయి. బాధితులను చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.